క్లుప్తంగా

డయేరియా బాధితులకు నాయకుల పరామర్శ



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 57వ డివిజన్ న్యూరాజరాజేశ్వరీపేటలో డయేరియాతో బాధపడుతున్న బాధితులను మంత్రులు సత్యకుమార్ యాదవ్, నారాయణ, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, నాగవంశం కార్పొరేషన్ చైర్మన్ ఎరుబోతు రమణారావులతో పాటు మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్ ఇసరపు దేవి, వైఎస్సార్ సీపీ నాయకులు, బీజేపీ, కాంగ్రెస్, సీపీఎం నాయకులు శుక్రవారం పరామర్శించారు. బాధితులతో మాట్లాడి ధైర్యంగా ఉండాలని.. తినే ఆహారం, తాగే నీటి విషయంలో ప్రతి ఒక్కరు జాగ్రత్తలు పాటించాలని వారు సూచించారు. జిల్లా కలెక్టర్ లక్ష్మీ, కార్పొరేషన్ కమిషనర్ ధ్యానచంద్ర, డీఎంహెచ్ఓ సుహాసినిలతో మాట్లాడి ప్రస్తుత పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు.

13 నుంచి టీటీడీ ఆధ్వర్యంలో మండలాభిషేకం

విజయవాడ కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో జూలై 26 నుంచి జూలై 31 వరకు పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించిన అష్టబంధన మహా సంప్రోక్షణ ముగిసిన సందర్భంగా వైఖానస సంప్రదాయం ప్రకారం ఈ నెల 13, 14 తేదీలలో మండలాభిషేకం నిర్వహిస్తునట్లు ఆలయ పర్యవేక్షకుడు ఎం. మల్లికార్జునరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 13 వ తేదీ శనివారం విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, మేదినీ పూజ, అంకురార్పణ, 14 వ తేదీ ఆదివారం అగ్నిప్రతిష్టాపన, అష్టోతర శతకలశాభిషేకం, పూర్ణాహుతి నిర్వహిస్తునట్లు తెలిపారు.

వ్యసనపరుల జీవితాల్లో కొత్తవెలుగు

ఈగిల్ ఐజీ ఆకే రవికృష్ణ

లబ్బీపేట(విజయవాడతూర్పు): మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారిన వారి జీవితాల్లో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించేందుకు ఇండ్లాస్ శాంతివన్ చేస్తున్న కృషి అమోఘమని ఈగిల్ ఐజీ ఆకే రవికృష్ణ అన్నారు. ఆయన శుక్రవారం నున్న లోని ఇండ్లాస్ శాంతివన్‌ను సందర్శించారు. అక్కడ రెండు గంటల పాటు గడిపి, రోగులు, వారి వివరాలను తెలుసుకున్నారు. వారిని ప్రోత్సాహకరమైన మాటలతో ప్రేరేపించారు. కోలుకునే మార్గంలో ఆశ, స్థితిస్థాపకతను బలోపేతం చేసేలా మాట్లాడారు. ఈ సందర్భంగా డాక్టర్ విశాల్ ఆధ్వర్యంలో అందిస్తున్న సేవలను ఆయన ప్రశంసించారు.

ప్రమాదకరంగా ఫ్యూజ్ బాక్స్



మధురానగర్(విజయవాడసెంట్రల్): నిత్యం రద్దీగా ఉండే 28వ డివిజన్ సత్యనారాయణపురం నర్రావారి వీధి రవీంద్రభారతి పాఠశాల సమీపంలో ఫ్యూజ్ బాక్స్ ప్రమాదకరంగా మారింది. ఇక్కడ ఫ్యూజ్ బాక్స్ వద్ద పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. ఫ్యూజ్ బాక్స్ తలుపులు సైతం తుప్పు పట్టి పాడయిపోయి తెరుచుకుని ఉన్నాయి. ఇక్కడకు అత్యంత సమీపంలోనే రెండు ప్రధాన పాఠశాలలు రవీంద్రభారతి, శ్రీ విజ్ఞాన విహార పాఠశాలలు ఉన్నాయి. నిత్యం వేలాది మంది చిన్నారులు ఈ మార్గం మీదుగానే రాకపోకలు సాగిస్తుంటారు. ఈ క్రమంలో చిన్నారులు ప్రమాదవశాత్తూ ఫ్యూజ్ బాక్స్‌ను తాకితే పెను ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అధికారులు తక్షణం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

సింగ్‌నగర్‌లో సీతారాం ఏచూరికి ఘన నివాళి



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సీపీఎం మాజీ కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి కార్యక్రమం సీపీఎం సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో సింగ్‌నగర్ లూనాసెంటర్‌లో శుక్రవారం ఘనంగా జరిగింది. ప్రముఖ వైద్యుడు శంకర్‌రావు, సీపీఎం నాయకులు బి.రమణారావు, కె.దుర్గారావు తదితరులు పాల్గొని ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తన జీవితమంతా ప్రజల శ్రేయస్సు కోసం అర్పించిన గొప్ప వ్యక్తి ఏచూరి అని, ఆయన అడుగుజాడల్లో అందరూ నడుచుకోవాలని వారు పిలుపునిచ్చారు. డీవైఎఫ్ఐ నాయకులు ఎస్కే నిజాముద్దీన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీపీఎం నాయకులు చింతల శ్రీనివాస్, వెంకట్, రాజు, పీఎస్ఎన్ మూర్తి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

న్యూ ఆర్‌ఆర్ పేటలో భయం..భయం!

న్యూరాజరాజేశ్వరిపేట భయం గుప్పిట్లో విలవిల్లాడుతోంది. ఓ పక్క ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకుంటున్నా బాధితులు రోజురోజుకు పెరుగుతూనే ఉన్నారు. వందల సంఖ్యలో ప్రజలు ప్రభుత్వ మెడికల్ క్యాంపులకు విచ్చేస్తుండగా, మరికొంతమంది ప్రైవేటు హాస్పిటల్స్‌లో చేరి చికిత్స చేయించుకుంటున్నారు. న్యూఆర్‌ఆర్‌పేటలో వైద్య శిబిరానికి శుక్రవారం 200కు పైగా బాధితులు రాగా, వీరిలో 45 మంది డయేరియా లక్షణాలతో బాధపడుతున్నట్లుగా వైద్యులు ధ్రువీకరించడం గమనార్హం. శుక్రవారం రాత్రి గద్వాల నరసింహ(38) డయేరియాతో మరణించాడు.

- రోజురోజుకూ పెరుగుతున్న బాధితులు
- హోటళ్లు, టిఫిన్ బండ్లు, వాటర్ ప్లాంట్లు, మాంసం దుకాణాలు, బడ్డీకొట్లు మూసివేత
- అన్ని ప్రాంతాలలో తాగునీటికి పరీక్షలు
- డివిజన్ అంతా జల్లెడ పట్టినా కారణాలు తెలియక తలలు పట్టుకుంటున్న అధికారులు
- ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే మాకీ గతి అంటూ ప్రజల ఆర్తనాదాలు



పగిలిపోయిన డ్రెయినేజీ పైపులను చూపుతున్న స్థానిక మహిళ



అపార్ట్‌మెంట్‌ల మధ్య పేరుకుపోయిన మురుగు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): నగరంలోని 57వ డివిజన్‌లో నెలకొన్న డయేరియాకు కారణాలు తెలుసుకోవడంపై జిల్లా కలెక్టర్, కార్పొరేషన్ కమిషనర్, ఫుడ్‌సేఫ్టీ అధికారులతో కూడిన జిల్లా యంత్రాగం అంతా గత మూడు రోజుల నుంచి తీవ్రంగా శ్రమిస్తున్నారు. న్యూఆర్‌ఆర్‌పేటలో అన్ని హోటళ్లు, టిఫిన్ బండ్లు, మినరల్ వాటర్ ప్లాంట్‌లు, మాంసం దుకాణాలు, తినుబండారాలు అమ్మే బడ్డీకొట్లు, చిల్లరకొట్లు అన్నీ మూసివేయించి కొన్నింటిని సీల్ చేసేశారు. పలు దుకాణాల్లో పాడైపోయిన తినుబండారాలను పారవేయించి, నోటీసులు జారీ చేశారు. డివిజన్‌లోని అన్ని ప్రాంతాల నుంచి నీటి నమూనాలను తీసుకువచ్చి ఫుడ్ సేఫ్టీ అధికారులు పరీక్షలు చేయిస్తున్నారు. అయినా ఇంతవరకు అసలు ప్రజలు అనారోగ్యం బారినపడడానికి గల కారణాలు తెలియకపోవడంతో తలలు పట్టుకుంటున్నారు.

చవితి భోజనాలే కారణమనడంపై ప్రజల ఆగ్రహం

డయేరియా లేదు.. నీటి కాలుష్యం లేదు.. ఇటీవల జరిగిన వినాయక చవితి పందిళ్ల వద్ద తీసుకున్న ఆహారం కలుషితమై ఇలా వాంతులు, విరేచనాలు వస్తున్నాయంటూ ప్రభుత్వ పెద్దలు, అధికారులు వివరణ ఇస్తుండడంపై స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. వినాయక చవితి పందిరిలో భోజనాలే కారణం అయితే అసలు ఆ భోజనాలే తినని ముస్లింలు, క్రైస్తవులు ఎందుకు డయేరియా బారిన పడుతున్నారని నిలదీస్తున్నారు.

ఏడాదిగా ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం

గత ఏడాది బుడమేరు వరదల కారణంగా నివాసాల మధ్య ఉన్న డ్రెయినేజీ పైపులు పగిలిపోయాయి. సైడ్ డ్రెయిన్లు కూలిపోయాయి. కాలువల్లో మురుగు పారడం లేదు. చెత్త తీయడం లేదు. తాగునీటి పైపులైన్లు అడుగడుగునా లీకులుంటున్నాయి. రంగు మారిన నీళ్లు దుర్వాసనలతో వస్తున్నాయని గత ఏడాది నుంచి మొత్తుకుంటున్నా ఈ ప్రభుత్వం నిరుపేద ప్రజలమైన తమ మీద ఎటువంటి జాలి, దయ, కనికరం లేకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం వలనే తమకు ఈరోజు ఈ దుస్థితి ఏర్పడిందని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల మధ్యలో పందులు సంచరిస్తుండడం, మురుగు, చెత్త, దోమలు, ఈగలు, కలుషిత నీరు తాగుతూ జీవిస్తే డయేరియా రాకుండా ఎలా ఉంటుందని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు తమ ప్రాంతంలో ప్రధానమైన తాగునీటి పైపులైన్ వ్యవస్థ, పారిశుద్ధ్య వ్యవస్థ ఎలా ఉందో ఒక్కసారి వచ్చి చూసి వాటికి మరమ్మతులు చేయించి శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

ఏడాది నుంచి మురుగు కంపులోనే ఉంటున్నాం



ఏడాది కిందట వచ్చిన బుడమేరు వరదల్లో మా అపార్ట్‌మెంట్‌లకు ఉన్న డ్రెయినేజీ పైపులైన్లు అన్నీ పగిలిపోయాయి. ఆ డ్రెయినేజీ మురుగంతా ఇళ్ల మధ్యే నిండిపోయి పారుతోంది. వీటి నుంచి వస్తున్న దుర్వాసనలతో ఇళ్లల్లో ఉండలేకపోతున్నాం. ఏడాది నుంచి మొత్తుకుంటున్నా ఒక్కరు కూడా పట్టించుకోవడం లేదు. మేము తరచూ రోగాల బారిన పడుతున్నాం.

– సత్యవతి, స్థానికురాలు

దుర్భర పరిస్థితుల మధ్య జీవిస్తున్నాము



నిరుపేద ప్రజలు జీవించే ప్రాంతం అని మా ఏరియాపై ప్రభుత్వం చిన్న చూపు చూస్తోంది. చెత్త, చెదారాలు, మురుగు, పందుల మధ్య జీవిస్తున్నాం. ఎన్నిసార్లు చెప్పినా ఒక్క అధికారి కూడా వచ్చి చూడడం లేదు. జ్వరాలు, వాంతులు, విరేచనాలు, చర్మ వ్యాధులు మాకు తరచూ వస్తున్నాయి.

– అప్పికొండ ప్రసాద్, స్థానికుడు

మీకేం కాదు- భయపడకండి

వీఎంసీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి భరోసా



ఆస్పత్రిలో బాధితులను పరామర్శిస్తున్న వీఎంసీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి

పటమట(విజయవాడతూర్పు): డయేరియాతో బాధపడుతున్నవారికి విజయవాడ నగరపాలక సంస్థ అండగా ఉంటుందని, భయపడవద్దని మేయర్ రాయన భాగ్యలక్ష్మి భరోసా ఇచ్చారు. శుక్రవారం ఆమె 57వ డివిజన్ కొత్త రాజరాజేశ్వరి పేటలో కేర్ అండ్ షేర్ పాఠశాలలో ఉన్న ప్రథమ వైద్య శిబిరంను సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ చికిత్స పొందుతున్న వారితో మాట్లాడి వారు భయాందోళన పడాల్సిన అవసరం లేదని, వారికి సరైన చికిత్స అందించి, వారిని ఆరోగ్యకరంగా ఉంచడమే లక్ష్యమన్నారు. వీఎంసీ ఆధ్వర్యంలో బాధితులకు ఎలాంటి హాని కలగకుండా ప్రత్యేకమైన చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. బాధితులు ప్రథమ ఆరోగ్య శిబిరానికి వచ్చే ఓపిక కూడా లేనివారు ఇంకొంతమంది ఇళ్లలోనే బాధపడుతున్నారని గమనించి, వారికి వాహనాలు ఏర్పాటు చేసి ప్రథమ ఆరోగ్య కేంద్రానికి వచ్చేటట్టు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆరోగ్య సర్వేను పూర్తిస్థాయిలో నిర్వహిస్తూ ప్రతి కుటుంబంలో అనారోగ్యం లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో 57వ డివిజన్ కార్పొరేటర్ ఇసరపు దేవి, తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి షిర్డీసాయినాథుని పుణ్యతిథి మహోత్సవాలు



షిర్డీసాయినాథుని పుణ్యతిథి మహోత్సవం కరపత్రాలు ఆవిష్కరిస్తున్న పూనూరు గౌతంరెడ్డి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రా షిర్డీగా విరాజిల్లుతున్న ముత్యాలంపాడు శ్రీషిర్డీసాయిబాబా మందిరంలో ఈనెల 22వ తేదీ నుంచి వచ్చేనెల 3వ తేదీ వరకు షిర్డీ సాయినాథుని పుణ్యతిథి మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి తెలిపారు. స్థానిక ముత్యాలంపాడు శ్రీషిర్డీసాయిబాబా మందిరంలో శుక్రవారం సాయంత్రం షిర్డీసాయినాథుని 107వ పుణ్యతిథి మహోత్సవాల కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులతో కలిసి కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు విశేషంగా ఐదురకాల నైవేద్యాలు, సాయంత్రం సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశామన్నారు. భక్తులు షిర్డీసాయినాథుని పుణ్యతిథి మహోత్సవాలలో పాల్గొని బాబావారి కృపకు పాత్రులు కావాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో మందిర కోశాధికారి మండలపర్తి సత్యశ్రీహరి, అర్చకులు కె.బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

కొత్త చట్టాలతో షాపు ఉద్యోగులపై మరింత పనిభారం



సభలో మాట్లాడుతున్న షాపు ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు బాబూరావు

కృష్ణలంక(విజయవాడతూర్పు): కొత్త చట్టాల అమలుతో షాపులలో పనిచేసే ఉద్యోగులపై పనిభారం పెరిగిందని, ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని షాపు ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు సీహెచ్ బాబూరావు అన్నారు. రాఘవయ్య పార్కు సమీపంలోని బాలోత్సవ్ భవన్‌లో షాప్ ఎంప్లాయిస్ యూనియన్ నగర 15వ మహాసభ జి.వెంకటేశ్వరరావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చాక ఉన్న చట్టాలను మార్పు చేసి లేబర్ కోడ్‌లు తీసుకురావడం వలన కార్మికులు తమ హక్కులను కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. పని గంటలు విపరీతంగా పెంచడంతో పాటు, సెలవు దినాల్లో కూడా బలవంతంగా పని చేయించుకొనే విధంగా చట్టాలు రూపొందించారన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కూడా కేంద్ర ప్రభుత్వ విధానాలనే అమలు చేస్తోందన్నారు. షాపుల్లో ఎక్కువ శాతం మహిళలు పనిచేస్తున్నారని, వారికి కనీస మౌలిక సదుపాయాలు, ఖాళీ సమయాల్లో షాపుల్లో కూర్చునే అవకాశం లేకపోవడం వలన వెరికోస్వెయిన్స్ వంటి దీర్ఘకాల వ్యాధుల బారిన పడుతున్నారని తెలిపారు. నగరంలో షాపింగ్ మాల్స్ పెరుగుతున్న నేపథ్యంలో కనీస సౌకర్యాలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని, కనీస వేతనాలు అమలు చేసే విధంగా చట్టాలు చేయాలని, కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో అమలు చేసినట్లు బిజినెస్ లేని సమయాల్లో కూర్చునే అవకాశం కల్పించే విధంగా చట్టాలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ ఎ.కమల, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎ.వెంకటేశ్వరరావు, సెంట్రల్ సిటీ అధ్యక్ష, కార్యదర్శులు కె.దుర్గారావు, ఎంవీ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు దొంగచాటుగా బిగించే యత్నం

- అదాని సిబ్బందిని ప్రతిఘటించిన స్థానికులు
- బలవంతపు బిగింపులు ఆపకపోతే పోరాటం
- విద్యుత్ ఏఈని కలసి వినతిపత్రం అందజేసిన సీపీఎం నాయకులు



విద్యుత్‌సబ్‌స్టేషన్ ఏఈకి వినతిపత్రం అందచేస్తున్న సీపీఎం నాయకులు

పాయకాపురం(విజయవాడరూరల్): విద్యుత్ స్మార్ట్ మీటర్లను ఇళ్లల్లో దొంగచాటుగా బిగించటానికి ప్రయత్నించిన అదాని సిబ్బందిని స్థానికులు ప్రతిఘటించారని సీపీఎం సెంట్రల్ సిటీ నాయకులు బి.రమణారావు, కె.దుర్గారావు, సీహెచ్ శ్రీనివాస్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. నగరంలోని 61వ డివిజన్ శాంతినగర్‌లో గురువారం బోయిన సరోజిరాణి ఇంటికి ఎవరూ లేని సమయంలో అదాని సిబ్బంది వెళ్లి గేటు దూకి స్మార్ట్ మీటరు బిగించే ప్రయత్నం చేశారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి గోడ ఎందుకు దూకుతున్నారని స్థానికులు వారిని ప్రశ్నించగా, స్మార్ట్ మీటరు బిగించడానికి వచ్చినట్లు సమాధానం ఇచ్చారని చెప్పారు. విద్యుత్ శాఖ మంత్రి నివాస ప్రాంతాలకు స్మార్ట్ మీటర్లు పెట్టం అని ప్రకటించినప్పటికీ ఇళ్లల్లో ఎవరూ లేని సమయం చూసి దొంగచాటుగా మీటర్లు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వ ఆదేశాలు లేకుండా, పైస్థాయి అధికారుల అనుమతి లేకుండా ఇలాంటి సంఘటనలు జరుగుతాయా అనే అనుమానాలను సీపీఎం నాయకులు వ్యక్తం చేశారు. బలవంతపు బిగింపులు ఆపకపోతే ప్రజలను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు చేస్తామని సీపీఎం నాయకులు హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం పాయకాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈ రామ్‌సుందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

సింగ్‌నగర్‌లో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని లూనాసెంటర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో వార్షిక తనిఖీలు, మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకూ విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ పి.రవీంద్రబాబు, సింగ్‌నగర్ ఏఈ డి.కిరణ్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సింగ్‌నగర్ రైతుబజార్, యార్డు రోడ్డు, ఎంకే బేగ్ మున్సిపల్ హైస్కూల్, చల్లగాలి ఐజయ్య వీధి, రైల్వేట్రాక్ రోడ్డు, లూనాసెంటర్ మెయిన్‌రోడ్డు, నార్త్‌జోన్ తహసీల్దార్ కార్యాలయం, వడ్డెర కాలనీ, ఇమ్మాన్యుయేల్ చర్చి పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, ఆయా ప్రాంతాల్లోని వినియోగదారులు గమనించి తమకు సహకరించాలని వారు కోరారు.

కళాకారుల సంక్షేమానికి కృషి చేయాలి

విజయవాడ కల్చరల్: కళాకారుల సంక్షేమానికి సాంస్కృతిక కళా సంస్థలు కృషి చేయాలని విశ్రాంత పోలీస్ అధికారి కె.డేవిడ్‌రాజు అన్నారు. తెలుగు కళావాహిని, శ్రీ కళాభారతి, కామ్రేడ్ జీఆర్‌కే, పోలవరపు సాహితీ సమితి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కళాకారుల ఆత్మీయ సమావేశం, సినీ సంగీత విభావరి కార్యక్రమాన్ని కొత్తా పూర్ణానందం కళావేదిక మీద శుక్రవారం నిర్వహించారు. డేవిడ్‌రాజు మాట్లాడుతూ కళాకారులు సాంస్కృతిక వారధులన్నారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు మాట్లాడుతూ కళాకారులకు గుర్తింపు కార్డులను ఇవ్వాలని సూచించారు. బోడి ఆంజనేయరాజు, అయ్యప్పన్ సింగంశెట్టి చంద్రశేఖర్, గోళ్ళ నారాయణరావు, మీరాకుమార్, కోట వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు. గాయనీ గాయకులు మల్లాది స్వాతి, దుర్గాభవాని, నాగేశ్వరమ్మ, రేష్మ, దుర్గాభవాని చిత్ర గీతాలను ఆలపించారు.

ఆహార దుకాణాలన్నింటినీ మూసేయండి



అధికారులను ఆదేశిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): కొత్త రాజరాజేశ్వరి పేటలో గల ఆహార దుకాణాలన్నిటిని మూసేయాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్నం కొత్త రాజరాజేశ్వరిపేటలో ఆయన పర్యటించారు. తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ అంశాలన్నీ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ 56, 57, 58 డివిజన్లో 11 సచివాలయాల పరిధిలో గల ప్రతి ఒక్కరికి శుద్ధమైన తాగునీరు బబుల్స్, టాంకర్ల ద్వారా సరఫరా చేయాలని, ఆ నీరును కాచి చల్లార్చి మాత్రమే తాగాలని, 11 సచివాలయాలకు కేటాయించిన 11 స్పెషల్ ఆఫీసర్లు ప్రతి ఒక్కరికీ అతిసార వ్యాధి రాకుండా నివారణ చర్యల గురించి అవగాహన కల్పించాలన్నారు. నగర పరిధిలోని ఆర్వో ప్లాంట్ ద్వారా నీటి సరఫరా వ్యాపారం చేస్తున్న ప్రతి ఒక్కరికీ కచ్చితంగా ట్రేడ్ లైసెన్స్, బీఎస్ఐ సర్టిఫికేషన్ ఉండాలని, లేకపోతే వారి దుకాణాలను మూసేయాలని, చికెన్, మటన్, ఆహార దుకాణాలన్నీ మూసివేయాలని ఆదేశించారు. హోటళ్లకి కూడా ట్రేడ్ లైసెన్స్ కచ్చితంగా ఉండాలని, లైసెన్స్ లేకపోతే వెంటనే సీజ్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ కె.ప్రభుదాస్, చీఫ్ ఇంజినీర్ ఆర్. శ్రీనాథరెడ్డి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు, చీఫ్ సిటీ ప్లానర్ కె.సంజయ్ రత్నకుమార్, పర్యవేక్షణ ఇంజినీర్ పి.సత్యకుమారి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఆర్‌ఆర్‌లో మేధోసంపత్తి హక్కులపై సదస్సు



మాట్లాడుతున్న వక్త సుధీర్

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం మేధో సంపత్తి హక్కులపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా కామ్‌ప్రో ఇన్నోవేషన్ ప్రైవేట్ లిమిటెడ్ సహ ప్రారంభకులు డాక్టర్ పి.కృష్ణప్రసాద్ ఒక స్టార్టప్ ప్రారంభించే సమయంలో వచ్చే సమస్యలు.. తన అనుభవాలను వివరించారు. ప్రతి వ్యక్తి తమ ఆవిష్కరణలకు పేటెంట్లు పొందే విధానాన్ని వివరించారు. వీవీఐటి విశ్వవిద్యాలయం డెప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.పవన్ కుమార్ మేధో సంపతి హక్కులు పొందే సమయంలో డిజిటల్ అవరోధాలపై అధ్యాపకులకు అవగాహన కల్పించారు. హైదరాబాద్‌కు చెందిన విజయ్ కుమార్ పేటెంట్ చట్టాలపై అవగాహన కల్పించారు. వక్త సుధీర్ మాట్లాడుతూఅధ్యాపకులు పొందిన పరిశోధనా పత్రాలను, ఏ విధంగా పేటెంట్‌గా మార్చుకోవచ్చునో వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ తమ కళాశాల లోని అధ్యాపకులు ఈ సంవత్సరంలో 60కి పైగా పరిశోధనా పత్రాలు, వివిధ జర్నల్స్‌లో ప్రచురితమవటం కళాశాలకు గర్వకారణం అని అన్నారు. అధ్యాపకులు తగినన్ని మేధో హక్కులు కూడా పొందితే మరింత గర్వకారణం అవుతుందన్నారు. మేధోసంపత్తి హక్కుల విషయంలో, పేటెంట్లు పొందడంలో అనుభవజ్ఞులయిన నలుగురు పేటెంట్ నిపుణులు తమ అనుభవాలను వివరించారు. ఈ సందర్భంగా పలువురు అడిగిన ప్రశ్నలకు సుధీర్ సమాధానాలు ఇచ్చారు. కార్యక్రమాలను ఐక్యూఏసీ సమన్వయకర్త నాగేశ్వరరావు పర్యవేక్షించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా దసరా శరన్నవరాత్రుల వేడుకల ఏర్పాట్లు



ఏపీసీపీడీసీఎల్ కార్యాలయ ప్రాంగణంలో శుభ్రం చేయిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): దసరా శరన్నవరాత్రుల ఉత్సవాలకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నామని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. నగర పర్యటనలో భాగంగా దసరా శరన్నవరాత్రులకు వీఎంసీ చేస్తున్న ఏర్పాట్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ఆదేశాల మేరకు వీఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద, ఏపీసీపీడీసీఎల్ కార్యాలయం ప్రాంగణంలో హోల్డింగ్ ఏరియాను ఏర్పాటును పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ దసరా శరన్నవరాత్రుల సందర్భంగా భక్తులకు ఎటువంటి లోపం లేకుండా విజయవాడ నగర పాలక సంస్థ తాగునీరు, మరుగుదొడ్లు, ఉచిత చెప్పుల స్టాండ్ వంటి ఏర్పాట్లు చేస్తోందని, 39 ప్రాంతాలలో 25 లక్షల వాటర్ బాటిల్స్, 35 లక్షల వాటర్ ప్యాకెట్స్‌ను ఏర్పాటు చేయనున్నామని అన్నారు. 19 ప్రాంతాలలో 405 తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేయనున్నామన్నారు. పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించామని, ఉభయ తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచే కాకుండా దేశ, విదేశాల నుంచి వచ్చే భక్తులకు అమ్మవారి దర్శనంలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు పరిశుభ్రమైన వాతావరణాన్ని నెలకొల్పేందుకు 1490 మంది సిబ్బందితో 24 గంటలు మూడు షిఫ్ట్ లలో పారిశుద్ధ్య నిర్వహణ చేస్తున్నామన్నారు. ప్రజల సౌకర్యార్థం ఆరు ప్రాంతాలలో ఉచిత చెప్పుల స్టాండ్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్‌లో వీఎంసీ ఏర్పాటు చేసిన ఏర్పాట్లలో ఎటువంటి లోపం లేకుండా ఎప్పటికప్పుడు నివేదికలను సేకరిస్తామన్నారు. మౌలిక సదుపాయాలలో సమస్య ఉత్పన్నమయితే వెంటనే కంట్రోల్ రూమ్ ద్వారా అందేటట్టు 24 గంటలు మూడు షిఫ్టులలో సిబ్బంది పనిచేస్తారని, వీటితోపాటు మోడల్ గెస్ట్ హౌస్‌లో శాఖల సమన్వయంతో అక్కడ కూడా సిబ్బంది మరోవైపు పని చేయటానికి ఏర్పాట్లు చేశారని చెప్పారు.

మేస్త్రి ఓబుల్ రెడ్డిపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలి

ఇఫ్టూ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా



పశ్చిమ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఇఫ్టూ నాయకులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ నాయకుడు ఓబుల్ రెడ్డి మేస్త్రీపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఇఫ్టూ ఆధ్వర్యంలో శుక్రవారం భవానీపురంలోని పశ్చిమ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవానీపురం ఏరియా నాయకుడు ఓబుల్ రెడ్డి మేస్త్రిపై ఈ నెల 8వ తేదీన ఆర్టీసీ వర్క్ షాప్ రోడ్‌లో కాపులపల్లి శ్రీనివాస రెడ్డి, ఆటో శ్రీనుతో పాటు 10 మంది కలిసి దాడి చేశారన్నారు. దాడిలో బ్లేడ్ బ్యాచ్ పాల్గొన్నారన్నారు. దాడికి పాల్పడిన వారిని తక్షణమే అరెస్ట్ చేయాలన్నారు. అనంతరం డెప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అక్కడి నుంచి భవానీపురం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి సీఐతో చర్చించారు. సీఐ కేసులో ఉన్న వారిని ఏ ఒక్కరినీ వదిలిపెట్టబోమని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ధర్నా కార్యక్రమంలో ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ, బీసీడబ్ల్యూయూ జిల్లా కార్యదర్శి షేక్ మీరావలి, జిల్లా సహాయ కార్యదర్శి పెద్ది రాజు, బ్రహ్మయ్య, ఏరియా అధ్యక్ష, కార్యదర్శులు తిరుపతయ్య, ఓబుల్ రెడ్డి, అరుణోదయ శ్రీను, పీవోడబ్ల్యూయూ సిటీ అధ్యక్షురాలు షేక్ ఆసియా, రాముడు, మాలకొండయ్య, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రేపు నేతాజీ కాలనీలో అన్నదానం

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ నేతాజీ కాలనీ రమాదేవి నగరపాలక సంస్థ పాఠశాల సమీపంలో వినాయకచవితి ఉత్సవాలలో భాగంగా ఆదివారం బోనం నాగు ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యాన అన్నదానం నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ బోనం నాగు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు అన్నదానం జరుగుతుందన్నారు. భక్తులు అన్నదానంలో పాల్గొని వినాయకుని ప్రసాదం స్వీకరించాల్సిందిగా ఆయన కోరారు.